@netifocusnews @focustv
https://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: ఎం. తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | శుక్రవారం, 19 జనవరి 2024 | పేజీలు - 4




## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇద్దరే నిమినేషన్లు

**• ఏకగ్రీవం అయ్యే ఛాన్స్**


**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18:** తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగిసింది. రెండు స్థానాల కోసం ఇద్దరు కాంగ్రెస్ అభ్యర్థులు నుంచి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఇక, ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో బల్మూరి వెంకట్, మహేష్ కుమార్ గౌడ్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. నామినేషన్ దాఖలుకు గురువారం ఆఖరి రోజు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థులు మహేష్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌లు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఇదిలా ఉండగా.. ప్రతిపక్షాల నుంచి ఎవరూ నామినేషన్ వేయలేదు. దీంతో, వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. మరోవైపు.. శుక్రవారం నామినేషన్ల పరిశీలన కొనసాగనుంది. ఈనెల 22వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. అదే రోజున మధ్యాహ్నం మూడు గంటలకు అభ్యర్థుల ఎన్నికపై ప్రకటన వెలువడనుంది.

### శ్రీరామ జన్మభూమిపై..

## స్మారక పోస్టల్ స్టాంప్

### విడుదల చేసిన ప్రధాని మోడీ

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, జనవరి18:** రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు ముందుగా గురువారం శ్రీరామ జన్మభూమి ఆలయంపై స్మారక పోస్టల్ స్టాంప్‌ను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. దీనితో పాటు రాముని చిత్రంతో కూడిన స్టాంపుల పుస్తకాన్ని కూడా ప్రధాని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేశారు. ఈ 48 పేజీల పుస్తకంలో 20 దేశాల స్టాంపులు ఉన్నాయి. రామాలయ పోస్టల్ స్టాంపు విడుదల అనంతరం ప్రధాని మోదీ ఓ వీడియో సందేశాన్ని కూడా విడుదల చేశారు. ప్రధాని మోదీ మొత్తం 6 తపాలా స్టాంపులను విడుదల చేశారు. వీటిలో రామాలయం, గణెళిశుడు, హనుమంతుడు, జటాయువు, శబరి మొదలైనవి ఉన్నాయి. ఈ 48 పేజీల పుస్తకంలో అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కంబోడియా, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు సహా 20కి మించిన దేశాలు విడుదల చేసిన పోస్టల్ స్టాంపులు ఉన్నాయి.



### ఆరు నెలల్లో కాంగ్రెస్‌పై

## ప్రజా తిరుగుబాటు

ఆదానీని దొంగ అంటూనే అలయ్ బలయ్

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

ఎమ్మెల్సీలకు కేటీఆర్ పిలుపు



2

ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఎన్నికల ముందు అదానీ దొంగ అని విమర్శించిన రేవంత్ రెడ్డి.. సీఎం అయ్యాక దావోస్ సాక్షిగా అదానీతో అలయ్-బలయ్ చేసుకున్నారని విమర్శించారు.

– నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18

### స్వామిగౌడ్, ప్రకాశ్ గౌడ్‌లతో..

## పొన్నం చర్చలు

కాంగ్రెస్‌లో చేరాలని కోరినట్లు సమాచారం

నేరుగా ఇంటికి వెళ్లి చర్చించినట్లు ప్రచారం





**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేరికలపై దృష్టి పెట్టింది. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్‌లో స్వామిగౌడ్ నివాసానికి వెళ్లారు. స్వామిగౌడ్‌తో పాటు కుటుంబసభ్యులతో చర్చించారు.

వివరాలు 2లో



### 2028 కల్లా

## భారత్ స్పేస్ స్టేషన్

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వెల్లడి

2లో..

### భూకంపాలను తట్టుకునేలా..

## అయోధ్య

ఆలయ నిర్మాణంలో ఆధునిక సాంకేతికత

వెయ్యేళ్లపాటు చెక్కు చెదరకుండా ఉండేలా నిర్మాణం



**నేటి ఫోకస్ న్యూస్, అయోధ్య,జనవరి18:** అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమ తేది సమీపిస్తున్న కొద్దీ.. ఆలయ నిర్మాణ విశేషాల కోసం చాలా మంది వెతుకుతున్నారు. ఎలాంటి భూకంపం, వరదలు వచ్చినా వెయ్యేళ్లపాటు తట్టుకునేలా ఆలయ డిజైన్ జరిగినట్లు నిపుణులు చెబుతున్నారు. వారు అయోధ్యను ఒక ఇంజినీరింగ్ అద్భుతమని అభివర్ణిస్తున్నారు. కేవలం ఆధ్యాత్మిక స్థలంగానే కాకుండా గుడి నిర్మాణంలో ఎంతో సైన్స్ దాగి ఉందని

మిగతా 2లో

## అయోధ్యలో మరో కీలక ఘట్టం

గర్భాలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ట

శాస్త్రోక్తంగా జలాభిషేకాల నిర్వహణ

వివరాలు 2లో



### నేడు తమిళనాడుకు

## ప్రధాని మోడీ

ఆలయాలను సందర్శించి

పవిత్ర జలాల సేకరణ

భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

వివరాలు 2లో..



# 2028 కల్లా భారత్ స్పేస్ స్టేషన్

● ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి

**నేటి ఫోకస్ న్యూస్, చండీగఢ్,జనవరి18:** భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుపై ఇస్రో చైర్మన్ సోమనాథ్ కీలక విషయం వెల్లడించారు. భారత స్పేస్ స్టేషన్ ప్రాథమిక వెర్షన్ 2028లో నింగిలోకి వెళుతుందని తెలిపారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో గురువారం జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ కార్యక్రమం సందర్భంగా సోమనాథ్ మాట్లాడారు. 'భారత్ స్పేస్ స్టేషన్‌కు సంబంధించి వచ్చే ఏడాదికల్లా తొలి రౌండ్ పరీక్షలు నిర్వహిస్తాం. స్పేస్ స్టేషన్ బేసిక్ మోడల్‌ను 2028లో కక్ష్యలోకి పంపి 2035కల్లా దానికి పూర్తిస్థాయి రూపు తీసుకువస్తాం. స్పేస్ స్టేషన్ క్రూ కమాండ్ మాడ్యూల్, నివాస మాడ్యూల్, ప్రొపల్షన్ మాడ్యూల్, డాకింగ్ పోర్ట్ అనే విభాగాలు కలిగి ఉంటుంది. ఈ మొత్తం స్టేషన్ 25 టన్నుల బరువు ఉంటుంది. అవసరమైతే తర్వాత దీనిని విస్తరిస్తాం. స్పేస్ స్టేషన్ ద్వారా మైక్రో గ్రావిటీ పరిశోధనలు చేస్తాం' అని సోమనాథ్ తెలిపారు. కాగా, ఇప్పటివరకు నింగిలో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్) మాత్రమే ఉంది. దీనిని అమెరికా, కెనడా, జపాన్, యూరప్ సంయుక్తంగా నిర్మించాయి. 1984నుంచి 1993 మధ్య ఐఎస్ఎస్‌ను డిజైన్ చేశారు.

# భూకంపాలను తట్టుకునేలా అయోధ్య

(మొదటిపేజీ తరువాయి..)

అంటున్నారు. రామమందిరాన్ని టాటా, ఎల్ అండ్ టీ కంపెనీలు నిర్మించాయి. గుడి నిర్మాణ ప్రక్రియలో అధునాతన టెక్నాలజీని వినియోగించాయి. సంప్రదాయ నాగర శైలి వాస్తు శిల్పం నుంచి ప్రేరణ పొంది రూపొందించిన 360 స్తంభాలు ఆలయంలో ఉన్నాయి. వాటిని పూర్తిగా రాయితో మలిచారు. ఎక్కడా ఇనుము, ఉక్కు, సిమెంట్ మిశ్రమాలను వాడలేదు. వీటితోపోల్చితే రాయికి జీవితకాలం ఎక్కువ, భూకంపాలు వచ్చిన తట్టుకోగలిగే సామర్థ్యం రాయికి ఉంటుందని అధికారులు తెలిపారు. తొలుత భారీ గొయ్యి తీసి.. దాన్ని 56 పొరల కాంపాక్ట్ కాంక్రీట్‌తో గట్టిపరిచారు. దీంతో పునాది మరింత పటిష్టంగా మారింది. పునాదులు వేసే దగ్గరి నుంచి పిల్లర్లు నిలబెట్టే వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. బయటి ఉష్ణోగ్రతల ప్రభావం పునాదుల్లో ఫిల్ చేసే కాంక్రీట్ మిశ్రమంపై పడకుండా రాత్రిపూట మాత్రమే పనులు చేసేవారు. ఆలయ నిర్మాణానికి 150 మంది ఇంజినీర్లు, వేల సంఖ్యలో కార్మికులు రేయింబవళ్లు కష్టపడ్డారు. 6.5 తీవ్రతతో భూకంపాలు వచ్చినా తట్టుకునే సామర్థ్యం ఆలయానికి ఉంది. నేపాల్ నుంచి అయోధ్య వరకు భూకంప తీవ్రతను కొలిచే నిపుణుల బృందం రిపోర్టునిచ్చింది. ఇంజినీర్లు కొన్ని దశాబ్దాలుగా ఆలయ పరిసరాల్లో నమోదవుతున్న వర్షపాతం రికార్డులను పరిశీలించి భవిష్యత్తులో వరదలు వచ్చినా రామమందిరంపై ప్రభావం పడకుండా డిజైన్ చేశారు.

# ఉచిత బస్ ప్రయాణం వివక్ష

● పిల్ దాఖలు చేసిన ఉద్యోగి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18:** తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ వసతి కల్పించడం వివక్ష కిందకే వస్తుందని నాగోల్‌కి చెందిన ప్రైవేట్ ఉద్యోగి పిటిషన్ వేశారు. కేంద్ర చట్టాల ద్వారా ఏర్పాటైన ఆర్టీసీలో ఉచిత పథకంపై అధికారం రాష్ట్రానికి లేదని.. జీవో 47 రద్దు చేయాలని పిటిషనర్ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని నిలిపివేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానాకి పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండడంతో సీట్ల కోసం గొడవలు కూడా జరుగుతున్నాయి. పురుషులకు సీట్లు కూడా దొరకని పరిస్థితి ఉంది. మహిళల రద్దీ కారణంగా టికెట్లు కొనుగోలు చేసి వెళ్లే పురుష ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు.

## నేడు తమిళనాడుకు

# ప్రధాని మోడీ

● ఆలయాలను సందర్శించి పవిత్ర జలాల సేకరణ

● భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



**నేటి ఫోకస్ న్యూస్, చెన్నై,జనవరి18:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలయదర్శనం కొనసాగుతోంది. 22న అయోధ్య ప్రతిష్టాపనకు ముందే దేశంలోని ప్రముఖ ఆలయాలను సందర్శిస్తున్నారు. స్థానికంగా ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న శుక్రవారం చెన్నైకి రానున్నారు. ఇక్కడ మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ఆయన దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ ఆలయాలకు వెళ్లి ఆయా ప్రాంతాల్లోని నదులు, తీర్థాల నుంచి పవిత్ర జలాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీ సాయంత్రం 4.50 గంటలకు మోదీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి వస్తున్నారు. విమానాశ్రయం వద్ద గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలకనున్నారు. ఆ తర్వాత విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో మెరీనా బీచ్ నేపియర్ బ్రిడ్జి సమీపంలోని అడయార్ ఐఎన్ఎస్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో నెహ్రూ స్టేడియానికి చేరుకుంటారు. ఆ స్టేడియంలో 'ఖేలో ఇండియా' పోటీలను ఆయన ప్రారంభించనున్నారు. చెన్నై, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు నగరాల్లో ఈ పోటీలు ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో 18 ఏళ్లలోపు క్రీడాకారులు ఆరువేల మందికిపైగా పాల్గొంటున్నారు. ఈ క్రీడల ప్రారంభోత్సవాల్లో ప్రధానితోపాటు గవర్నర్‌రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 7.30 గంటలకు ఈ వేడుకలు పూర్తయ్యాక ప్రధాని మోదీ కారులో గిండిలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. రాజ్‌భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ సీనియర్ నేతలతో ఆయన భేటీ అవుతారు. రాత్రి ప్రధాని మోదీ రాజ్‌భవన్‌లోనే బసచేస్తారు. మరుసటి రోజు శ్రీరంగానికి బయలుదేరి వెళతారు. రాజ్‌భవన్ నుంచి కారులో ఉదయం 9.25 గంటలకు మీనంబాక్కం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో తిరుచ్చికి చేరుకుంటారు. తిరుచ్చి నుంచి కారులో శ్రీరంగం ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ ఆలయ పరిసరాల్లో 'స్వచ్ఛ్ తీర్థ్' పేరుతో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేయనున్నారు. శ్రీరంగం ఆలయంలో ఆయన ఉదయం 11 నుంచి 12.40 గంటలవరకు ఉంటారు. ఆ తర్వాత అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు రామేశ్వరానికి బయలుదేరి వెళతారు. రామేశ్వరం రామనాథస్వామివారి ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత ఆలయ పరిసరాలను శుభ్రం చేయనున్నారు. ఆ రోజు రాత్రి రామేశ్వరంలోని శ్రీరామకృష్ణ మఠంలో బస చేయనున్నారు. ఈ నెల 21 ఉదయం రామేశ్వరం అగ్నితీర్థం కడలిలో స్నానమాచరిస్తారు. మళ్లీ రామనాథస్వామిలో సేవలో పాల్గొంటారు. అక్కడ ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. తరువాత కారులో అరిచల్ మునై ప్రాంతానికి వెళతారు. ఉదయం 10.25 గంటలకు అక్కడి కోదండ రామాలయాన్ని సందర్శిస్తారు. ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 11.25 గంటల వరకు ఆలయంలోనే గడుపుతారు. అటు పిమ్మట అయోధ్య రామాలయం కోసం సముద్రంలో తీర్థ జలాలను సేకరించనున్నారు. ఇలా ఆలయాలలో సేకరించిన పవిత్ర జలాల కలశాలతో ఆయన హెలికాప్టర్‌లో మదురై విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా చెన్నై, తిరుచ్చి, శ్రీరంగం, రామేశ్వరం తదితర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

# స్వామిగౌడ్, ప్రకాశ్ గౌడ్‌లతో పొన్నం చర్చలు

● కాంగ్రెస్‌లో చేరాలని కోరినట్లు సమాచారం

● నేరుగా ఇంటికి వెళ్లి చర్చించినట్లు ప్రచారం



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేరికలపై దృష్టి పెట్టింది. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్‌లో స్వామిగౌడ్ నివాసానికి వెళ్లారు. స్వామిగౌడ్‌తో పాటు కుటుంబసభ్యులతో చర్చించారు. పార్టీలో చేరిక ఆహ్వానంపై స్వామిగౌడ్ ఎలా స్పందించారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పొన్నం ప్రభాకర్ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తోనూ చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. టీఎన్జీవో నాయకుడుగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన స్వామిగౌడ్.. బీఆర్ఎస్ తో తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత శాసన మండలి తొలి చైర్మన్ గా ఆయనకు కీలక పదవి అప్పగించారు. గతేడాది ఏప్రిల్‌లో శాసనమండలి సభ్యుడిగా, మండలి చైర్మన్‌గా పదవీ కాల పరిమితి పూర్తి చేసుకున్న స్వామిగౌడ్ కొంతకాలంగా టీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాల్లో అంతగా కనిపించట్లేదు. గతంలో గవర్నర్ కోటాలో శాసనమండలికి నామినేట్ అయిన స్వామిగౌడ్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ స్థానం నుంచి టీఆర్ఎస్ టికెట్ ఆశించారు. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి పోటీకి ఆసక్తి చూపినా అవకాశం లభించలేదు. ఏదేని ముఖ్యమైన కార్పొరేషన్ పదవి దక్కుతుందని ఆశించినా పార్టీ అధిష్టానం నుంచి స్పందన లేకపోవడంతో స్వామిగౌడ్ అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో 2020లో ఆయన బీఆర్ఎస్ ని వీడి బీజేపీ కండువా కప్పుకున్నారు. అయితే అక్కడ కూడా ఆయన ఉండలేక తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత స్వామిగౌడ్ తన రాజకీయ భవిష్యత్ గురించి పునరాలోచించారు. పొన్నం ప్రభాకర్ ఆహ్వానంతో కాంగ్రెస్ లోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.రేవంత్ రెడ్డితో స్వామిగౌడ్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రేవంత్ రెడ్డిని పొగిడారు. 'బడుగు, బలహీన వర్గాలకు రేవంత్‌రెడ్డి బలమైన వెన్నుపూస, చేతికర్రగా మారారు. తెల్లబట్టల నేతలకు అమ్ముడుపోవద్దని అంటూ రేవంత్‌రెడ్డిపై ప్రశంసలు కురిపించారు. 'తెలంగాణ ఉద్యమంలో స్వామిగౌడ్ అన్న పాత్ర ఎవరూ కాదనలేనిది. సమైఖ్య పాలనలో ఆయనపై దాడిచేసిన అధికారులకు కీలక బాధ్యతలిచ్చారు. తెలంగాణ బడుగు, బలహీనవర్గాల బిడ్డను గుర్తింపులేకుండా పక్కనపెట్టారు'అని రేవంత్‌రెడ్డి కూడా ప్రశంసించారు. అయితే అప్పట్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు. అంతే కాదు..రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా కూడా లేరు. అందుకే కాంగ్రెస్‌లో చేరకుండా బీజేపీలో చేరారు. ఇప్పుడు రేవంత్ కూడా ఆహ్వానించే అవకాశం ఉంది.. ఉద్యమకారులకు గుర్తింపునిస్తామని రేవంత్ చెబుతున్నారు కాబట్టి పార్టీలో చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# అయోధ్యలో మరో కీలక ఘట్టం

● గర్భాలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ట

● శాస్త్రోక్తంగా జలాభిషేకాల నిర్వహణ



**నేటి ఫోకస్ న్యూస్, అయోధ్య,జనవరి18:** ఈ నెల 22న జరగనున్న 'ప్రాణప్రతిష్ఠాపన' కార్యక్రమానికి ముందు కీలక ఘట్టం చోటుచేసుకుంది. సుమారు 550 ఏళ్ల తర్వాత అయోధ్య రామాలయం గర్భగుడిలో 'రామ్ లల్లా' విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్ఛారణ, జై శ్రీరామ్ నినాదాల మధ్య గురువారం ఈ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. మైసూరుకు చెందిన శిల్పకళాకారుడు అరుణ్ యోగిరాజ్ చెక్కిన 51 ఇంచుల 'రామ్ లల్లా' విగ్రహాన్ని గుర్భగుడిలో ఉంచారు. కాగా గురువారం వేకువ జామున విగ్రహాన్ని ఆలయంలోకి తీసుకొచ్చారు. ఓ ట్రక్కు ద్వారా తరలించి ఆ తర్వాత క్రేన్ సాయంతో గర్భగుడిలోకి చేర్చారు. కాగా శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టకు సంబంధించిన ఏడు రోజుల వైదిక ఆచారాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. అలాగే ఆలయంలో ప్రతిష్టించే రామ్ లల్లా విగ్రహాన్ని గర్భగుడిలోకి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని శ్రీరామ మందిర నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నృపేంద్ర మిశ్రా చెప్పారు. రామ్ లల్లా విగ్రహాన్ని తీసుకురావడానికి ముందే ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. గురువారం ఆలయంలో తీర్థ పూజ, జల యాత్ర, గంధాదివాస్ వంటి అనేక ఆచారాలు నిర్వహించారు. శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టలో భాగంగా నాలుగో రోజున ఉదయం ఔసధాధివస్, కేశరాధివస్, ఘృతాధివాసం, సాయంత్రం ధాన్యాధివస్తృతి కార్యక్రమాలు జరుగుతాయి. శనివారం ఉదయం శర్కరాధివస్, ఫలాధివస్త్రాలు, సాయంత్రం పుష్పాధివాసం నిర్వహిస్తారు. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం చివరి రోజైన ఆదివారం సంప్రోక్షణకు ఒకరోజు ముందు ఉదయం మధ్యాధివాసుల క్రతువు, సాయంత్రం శయ్యాధివాసం జరుగుతాయి. ఇదిలావుంటే అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం కోసం యావత్తు భారతదేశం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోంది. పల్లె నుంచి పట్టణం వరకు అందరి దృష్టి రామాలయం ప్రారంభోత్సవం మీదనే ఉంది. పవిత్ర దినం జనవరి 22న మధ్యాహ్నం 12.20 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రామ మందిరం ప్రారంభోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లోని క్లాక్ టవర్‌పై లేజర్ లైట్ ద్వారా శ్రీరాముడి చిత్రాలను ప్రదర్శించారు. డెహ్రాడూన్‌లో రద్దీగా ఉండే రోడ్డు మార్గంలో క్లాక్ టవర్‌పై ప్రదర్శించిన శ్రీరాముడి చిత్రాల లేజర్ షో చూపరులను ఆకట్టుకుంది. శ్రీరాముడి చిత్రాలు మాత్రమే కాకుండా, శ్రీరాముడు సీతమ్మ తల్లితో ఉన్న చిత్రాలు, ఆంజనేయస్వామితో ఉన్న చిత్రాలను క్లాక్ టవర్‌పై ప్రదర్శించారు. ఇందుకు సంబంధించిన 47 సెకన్ల వీడియోను ఏఎన్ఐ తన సోషల్ మీడియా ఖాతా ఎక్స్‌లో పోస్ట్ చేయగా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియో నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

# వింగ్స్ ఇండియా హైదరాబాద్‌కు గర్వకారణం

● అమెరికాకు నేరుగా విమానాలు నడపాలి

● జ్యోతిరాదిత్యకు మంత్రి కోమటిరెడ్డి వినతి



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18:** వింగ్స్ ఇండియా కార్యక్రమానికి హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. 'వింగ్స్ ఇండియా' కార్యక్రమం ప్రారంభమవనున్న నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, తెలంగాణ దేశంలోనే ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్ నుంచి యూఎస్ఏకు నేరుగా వారంలో కనీసం మూడుసార్లు విమానం వేయాలని జ్యోతిరాదిత్య సింధియాను కోరామన్నారు. ఎయిర్ అంబులెన్స్‌లు ఎక్కువగా హైదరాబాద్‌కు వస్తున్నాయని, డ్రోన్ పైలెట్లకు ఎక్కువగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, అత్యవసరాలకు, శాంతిభద్రతల కోసం డ్రోన్లు వినియోగిస్తున్నా మని, రాష్ట్రంలో సులభతర వాణిజ్య విధానం ఉందని, ఏరో స్పేస్ పెట్టుబడులకు హైదరాబాద్ ఎంతో అనుకూలంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నుంచి హైద్రాబాద్ మహానగరంలో 'ఇంటర్నేషనల్ వింగ్స్ ఇండియా ఎయిర్ షో' మొదలు అయ్యింది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్‌కు దేశ విదేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విమానం బోయింగ్ 777-9 తో పాటు అనేక విమానాలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఈనెల 21వ తేదీ వరకు జరిగే ఈవెంట్‌లో దేశ విదేశాలకు చెందిన ఏరోప్లేన్స్ కనువిందు చేస్తాయి. ఈ ప్రదర్శనలో 106 దేశాల నుంచి సుమారు 1500 మంది ప్రతినిధులు హాజరవుతారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఇండియా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# ఇళ్ల పథకంలో వడ్డీరాయితీ జమ

● రీయింబర్స్‌మెంట్ కింద రూ.46.9 కోట్లు విడుదల

● బటన్ నొక్కి మహిళల ఖాతాల్లో జమచేసిన సీఎం జగన్




**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి,జనవరి18:** రాష్ట్రంలో 12.77 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు పావలావడ్డీ రుణాలు ఇప్పించామని, ఈ దఫాలో 4.07 లక్షల మందికి వడ్డీ రియింబర్స్ కింద రూ.46.9 కోట్లు విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈకార్యక్రమం జరుగుతుంది. గతంలో సుమారు ఐదు లక్షలకు పైబడి అక్క చెల్లెమ్మలకు రూ.50 కోట్ల పైబడి ఇచ్చాం. రూ.35వేల రుణాలను పావలా వడ్డీకే ఇస్తున్నాం. దేశ చరిత్రలో ఎప్పుడూ కూడా జరగని విధంగా 31,19,000 ఇళ్ల స్థలాలు ఇచ్చాం. అందులో ఇప్పటికే 22లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఒక్కో ఇంటికి 2.7 లక్షలు ఖర్చు అవుతుంది. మౌలిక సదుపాయాలకు మరో రూ.1 లక్ష ఖర్చు అవుతోంది. ఇళ్ల నిర్మాణంకోసం ఉచితంగా ఇసుక ఇస్తున్నాం అని సీఎం జగన్ పేర్కొన్నారు. 'సిమెంటు, స్టీల్, మెటల్ ఫ్రేంలు తదితర ఇంటి సామగ్రి మీద కనీసంగా రూ.40వేలు మంచి జరిగేలా చూస్తున్నాం. ఒక్కో ఇంటి స్థలం విలువ జిల్లాను బట్టి, ప్రాంతాన్ని బట్టి రూ.2.5లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. అన్ని కలుపుకుంటే దాదాపు ప్రతి అక్క చెల్లెమ్మకు రూ.5 -20 లక్షల వరకూ ఒక ఆస్తిని ఇవ్వగలిగాం. ఈ అవకాశం దేవుడు నాకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. కేవలం పావలా వడ్డీకే రూ.35వేల చొప్పున రుణాలు ఇప్పిస్తున్నాం. ఈ మంచి కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని సీఎం జగన్ తెలిపారు.

## ఆరు నెలల్లో కాంగ్రెస్‌పై..

# ప్రజా తిరుగుబాటు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,జనవరి18:** ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఎన్నికల ముందు అదానీ దొంగ అని విమర్శించిన రేవంత్ రెడ్డి.. సీఎం అయ్యాక దావోస్ సాక్షిగా అదానీతో అలయ్-బలయ్ చేసుకున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ- అదానీ ఒకటేనని రాహుల్ అంటున్నారని.. మొన్న రేవంత్ కూడా అదానీ-మోదీ ఒకటేనని విమర్శించారని గుర్తు చేశారు. ఢిల్లీలో అదానీతో కొట్లాడుతూ తెలంగాణలో మాత్రం అదానీతో కలిసి ఎందుకు పనిచేస్తున్నారో చెప్పాలని రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో వరుసగా వివిధ ఎన్నికలు ఉన్నాయని.. వీటిని ఎదుర్కోవడం కోసం పార్టీ సంసిద్ధంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ ఎమ్మెల్సీలతో సమావేశం అయిన ఆయన.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు అవకాశాలు బలంగా ఉన్నాయని నమ్మకం వెలిబుచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీలు విస్తృతంగా పనిచేయాలని కోరారు. జిల్లా కేంద్రంగా పార్టీ కార్యక్రమాలను మరింత యాక్టివేట్ చేస్తామన్నారు. త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలతో సమావేశం ఉంటుందని.. అందులోనే శాసన మండలి పార్టీ నేతను ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఒత్తిడి కొనసాగిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్‌కు గుర్తు చేస్తామన్నారు. హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తే.. అసెంబ్లీలో ఉన్న బలమైన ప్రతిపక్షాలు శాసనసభ వేదికగా ప్రశ్నిస్తాయని హెచ్చరించారు. శాసనమండలి సభ్యులు పార్టీకి కళ్లు, చెవుల మాదిరిగా పని చేయాలని అన్నారు. శాసనమండలి సభ్యులు తమ నియోజకవర్గాల్లోని పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు పునర్వ్యవస్థీకరించాలని పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ భావిస్తున్నారని చెప్పారు. చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని కేటీఆర్ చెప్పుకొచ్చారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. సభకు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్‌లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేతలు హాజరయ్యారు.

# సంపాదకీయం

## అహంకారం చావని బిఆర్ఎస్ నేతలు !



చింతచచ్చినా పులుపు చావలేదన్నది సామెత... ఇది సరిగ్గా బిఆర్ఎస్ నేతలకు వర్తిస్తుంది. అధికారం పోయినా అహంకారం చావలేదు. తెలంగాణను అడ్డంగా దోచుకుని అప్పులకుప్పగా చేసి..ఎన్నో హామీలు గుప్పించి.. గోబెల్స్ ప్రచారాలతో ప్రజలను వంచించిన నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే విమర్శలకు దిగడం చూస్తుంటే వీరిని ఏమనాలో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా వంద రోజులు కూడా కాలేదని ఆగుతున్నామని, లేకపోతే హామీల అమలుపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడే వాళ్లమని బిఆర్ఎస్ ఎంఎల్ఎ టి.హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్టగా చూడాలి. అలాగే ఇంకా ప్రజలు కెసిఆర్‌నే సిఎంగా కోరుకుంటున్నారని..కెసిఆర్ సిఎంగా లేకపోవడంతో బాధపడు తున్నారని మరో ఎమ్మెల్యే కెటి రామారావు చేసిన వ్యాఖ్యలు కూడా అధికార అహంకారాన్ని సూచిస్తు న్నాయి. ఈ ఇద్దరు నేతలు గత కొన్ని రోజులుగా చేస్తున్న వ్యాఖ్యలు వారి అహంకారాన్ని పరాకాష్టకు చేర్చాయి. తెలంగాణ ప్రజలు చెమటోడ్చి, ప్రాణాలు అర్పించి తెచ్చిన తెలంగాణలో అధికారం అనుభవించి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్న వారి అవినీతిని చీల్చి చెండాడాలి. చరిత్రలో మరోమారు ఇలా అధికారం అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడాలంటే భయపడేలా చేయాలి. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుంటున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారు. ప్రజలు నిరంకుశ పాలన పీడవిరగడ అయ్యిందన్న భావనలో స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. ముందుగా అనేక అక్రమాలకు బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి. అందులో ధరణి అక్రమాలు, మిషన్ భగీరథ దుర్వినియోగం, మిషన్ కాకతీయ దుర్వినియోగం వంటివి ఉన్నాయి. నిన్నిటికి నిన్న ఖాజాగూడలో అక్రమంగా విల్లాల కోసం ప్రభుత్వ భూముల్లో రోడ్డు వేయడం వంటివి వున్నాయి. ఇవికాక నయీం డైరీ, మియాపూర్ భూముల బాగోతం, 111 జీవో రద్దు, ప్రభుత్వ భూముల ఆక్రమ అమ్మకాలు, అక్రమ ఆక్రమణలు, సొంతపార్టీకి కోకాపేటలో భూముల కేటాయింపు, ప్రతి నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులు వంటివన్నీ ఉన్నాయి. అన్నింటికి మించి భూములను అప్పనంగా అమ్మి తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారు. సకాలంలో జీతాలు ఇవ్వలేదు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్‌ను భ్రష్టుపట్టించారు. ఇంటర్ పరీక్షల పేపర్ల లీకేజీలతో విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకానేక అధికార దుర్వినియోగాలు కోకొల్లలు. వీటికి సమాధానం రావాలి. అంతెందుకు జర్నలిస్టులకు భూ కేటాయింపులో సుప్రీం తీర్పును కాలరాచినందుకు నిలదీయవచ్చు. సుప్రీం తీర్పునే ఖాతరు చేయని వారు పాలకులు ఎలా అవుతారో చెప్పాలి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మరింత అప్రమత్తం కావాలి. బిఆర్ఎస్ అక్రమాలను ఎక్కడిక్కడ నిలదీయాలి. ఈ సమస్యలపై ప్రశ్నలు సిద్ధం చేసుకుని నిలదీయాలి. ఎంపి ఎన్నికల్లో ఎందుకు ఓటేయాలో అడగాలి. ఎందుకు తెలంగాణను భ్రష్టు పట్టించారో అడగాలి. కొన్ని రోజులైతే బిఆర్ఎస్ నేతలు ఇంట్లో కూర్చున్నా, రండి రండని ప్రజలే బయటకు తీసుకువస్తారని హరీష్ రావు అనడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ప్రజలు అంత వెర్రిబాగుల వారని అనుకుంటున్నారా ఏమో అని అనిపిస్తోంది. కర్నాటక లో ఐదు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారిందని హరీష్ రావు విమర్శించడం అహంకారానికి పరాకాష్ట. అక్కడి సంగతి ఎందుకు ..ఇక్కడి తమ పదేళ్ల అవినీతిపై మాట్లాడితే మంచిది. శ్వేతపత్రాలపై మాట్లాడాలి. విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై మాట్లాడాలి. రైతుబంధు పేరుతో అప్పనంగా దోచిన సంగతిపై మాట్లాడాలి. కర్ణాటక ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలుతుందని ఎవరో హెచ్చరించారని అంటున్న హరీష్ రావు..ఇక్కడ కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడాలి. మన దగ్గర కూడా కాంగ్రెస్ నేతలు గ్యారంటీల చావు వార్త చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని చెప్పడం ద్వారా తమ పార్టీ వారిలో భరోసా నింపవచ్చేమో కానీ ప్రజలను ఇకముందు ఎంతమాత్రం నమ్మించలేరని గుర్తించాలి. తెలంగాణ పేరుతో వంచించిన పాపం ఇంకా భరించాల్సిన అసవరం ప్రజలకు లేదు. ఇంతకాలం అధికారంలో ఉండి కాకమ్మ కథలు చెబుతూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించడం ద్వారా ప్రజలు మరోమారు విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయం వచ్చింది. తెలంగాణ సమస్యలకి పరిష్కారం కోసం బిఆర్ఎస్ నేతలను ఎక్కడిక్కడ నిలదీయాల్సిన సమయం వచ్చింది. అప్పులు ఎవరు కడతారో..ఎలా కడతారో చెప్పాలని నిలదీయాల్సిన అవసరం వచ్చింది. కిషన్ రెడ్డినో, రేవంత్ రెడ్డినో, బండిసంజయ్‌నో విమర్శించి పబ్బం గడుపుకునే రోజులు పోయాయని కెటిఆర్, హరీష్ రావులు గుర్తించాలి. ప్రజలను ఇంకా మాయమాటలతో మోసపుచ్చలేమని గుర్తించాలి. వారివల్ల ఒక్క పనికాదని గత పదేళ్లలో తేలిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిస్తేనే వాళ్లు చేసిన పాపాలు పూర్తిగా పరిహారం అవుతాయి. గత పదేళ్లలో విభజన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. వాటిని సాధించడంలో బిఆర్ఎస్ ఎంపిలు కనీస ప్రయత్నం చేయలేదు. అప్పుడే చేయని వారు ఇప్పుడు చేస్తారన్న భరోసా లేదు. ఈ కీలక సమయంలో బిఆర్ఎస్ ఎంపిలు ఢిల్లీలో ఉంటే..తెలంగాణకు మరింత నష్టమని గుర్తించాలి. ఇది పాముకు పాలుపోయడమే అవుతుంది. అందువల్ల బిఆర్ఎస్ పట్ల ప్రజలు జాగరూకతతో ఉండాలి. అప్పుడే తెలంగాణకు మేలు చేకూరుతుంది.

## ప్రాజెక్టులకు జాతీయహోదా తెచ్చి మాట్లాడాలి

- వార్తల్లో ఉండాలన్నదే బిజెపి నేతల తాపత్రయం
- బిజెపి నేతల తీరుపై మాజీమంత్రి వేముల విమర్శలు



**నేటి ఫోకస్ న్యూస్, నిజామాబాద్,జనవరి18:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రం చేతులెత్తేసిందని, దీనిపై బిజెపి నేతలు ఎందుకు మాట్లాడరని మాజీమంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. అనేకానేక విభజన హామీలపై బండి సంజయ్, కిషన్ రెడ్డిలు మాట్లాడాలని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పాలమూరుకు జాతీయ హోదా తెస్తామని చెప్పిందని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచేది పోయి కాంగ్రెస్ నాయకులు, ఢిల్లీలో ప్రతిరోజూ బిజెపి నాయకుల మెడలకు దండలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్,బిజెపి మైత్రిని బండి సంజయ్ బహిరంగంగా ఒప్పుకున్నారని, కెసిఆర్ కాంగ్రెస్ ఎంఎల్ఎలను కొంటారని చెప్పడం దారుణమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బిజెపిదేనని బండి సంజయ్ గుర్తించాలని అన్నారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన బిజెపి బ్రోకర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని ప్రజలు ఇంకా మరచిపోలేదని గుర్తుచేశారు. బండి సంజయ్ సహా బిజెపి నేతలు వార్తల్లో ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలని ఎద్దేవా చేశారు. వారికి ఎంపి ఎన్నికల్లో పరాభవం తప్పదని అన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం బండి సంజయ్ ఏనాడూ ఒక్క రూపాయి అయినా తేలేని వాడు...అడ్డమైన విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, వాళ్ళు తీసుకున్న గోతిలో వాళ్లే పడ్డారని పేర్కొన్నారు. నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలంగాణ ఆర్థిక ప్రగతిని గొప్పగా పొగిడిందని అన్నారు. నీతి ఆయోగ్ నివేదికతోనైనా కాంగ్రెస్ నేతలు నిజాలు మాట్లాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు.

## టీ20ల్లో తొలి ప్లేయర్‌గా రోహిత్ శర్మ సరికొత్త రికార్డు!

అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఫోర్లు, సిక్సులతో విరుచుకుపడ్డాడు. హిట్‌మ్యాన్ 69 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 121 పరుగులు బాదాడు. 2019 తర్వాత టీ20 ఫార్మాట్లో తన తొలి సెంచరీ నమోదు చేశాడు. అంతేకాదు అంతర్జాతీయ టీ20లలో రోహిత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ సెంచరీతో టీ20ల్లో రోహిత్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ నిలిచాడు. రోహిత్ ఇప్పటివరకు 151 మ్యాచ్‌లు ఆడి 5 సెంచరీలు బాదాడు. మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ (60 మ్యాచ్‌లలో 4 సెంచరీలు), హార్డ్ హిట్టర్ గ్లెన్ మాక్స్‌వెల్ (100 మ్యాచ్‌లలో 4 సెంచరీలు)లు ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. సబావూన్ దేవిజీ, కోలిన్ మున్రోలు మూడు సెంచరీలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.మూడో టీ20లో రోహిత్ శర్మ సహా రింకూ సింగ్ కూడా విధ్వంసం సృష్టించాడు. 39 బంతుల్లో 69 పరుగులు చేశాడు. రింకూ ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉండటం విశేషం.

## విరాట్ కోహ్లి డకౌట్‌తో స్టేడియం మొత్తం గప్‌చుప్!



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం రాత్రి అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ డకౌట్ అయ్యాడు. అఫ్గన్ పేసర్ ఫరీద్ అహ్మద్ వేసిన మూడో ఓవర్ నాలుగో బంతికి పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించిన విరాట్.. మిడాఫ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ఇబ్రహీం జద్రాన్‌కు క్యాచ్ ఇచ్చి పరుగుల ఖాతా తెరకుండానే నిష్క్రమించాడు. తద్వారా తన అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో తొలిసారిగా గోల్డెన్ డక్ నమోదు చేశాడు. టీ20 ఇన్నింగ్స్‌లో ఎటువంటి పరుగులు చేయకపోవడం ఇది ఐదవసారి మాత్రమే. టీ20 ప్రపంచకప్ 2024కు ముందు భారత్ ఆఖరిగా ఆడుతున్న ఈ సిరీస్‌తోనే విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టీ20లలో పునరాగమనం చేశాడు. దాదాపుగా 14 నెలల అనంతరం విరాట్ భారత టీ20 జట్టులోకి వచ్చాడు. వ్యక్తిగత కారణాలతో తొలి మ్యాచ్‌కు దూరమైన కోహ్లీ.. రెండో మ్యాచ్‌తో రీఎంట్రీ ఇచ్చాడు. 16 బంతుల్లో 29 పరుగులు చేసి పర్వాలేదనిపించాడు. అయితే బెంగళూరులో జరిగిన మూడో టీ20లో మాత్రం విఫలమయ్యాడు. విరాట్ బ్యాటింగ్ మెరుపులు చూడాలని ఆశపడ్డ అభిమానులకు నిరాశే మిగిలింది. రన్ మెషిన్ అవుట్ కాగానే స్టేడియం మొత్తం నిశ్శబ్దంగా మారిపోయింది.బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో బుధవారం ఉత్కంఠ రేపిన మూడో టీ20లో రెండో సూపర్ ఓవర్లో అఫ్గానిస్థాన్‌ను భారత్ చిత్తుచేసింది. భారత్, అఫ్గాన్ జట్లు 212 పరుగులు చేయడంతో మ్యాచ్ టై కాగా.. తొలి సూపర్ ఓవర్ ఓవర్లో ఇరు జట్లు 16 పరుగులతో సమంగా నిలిచాయి. ఇక రెండో సూపర్ ఓవర్‌లో ముందుగా భారత్ 11 రన్స్ చేయగా.. అఫ్గాన్ 1 పరుగుకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

## శివాలయాన్ని స్వచ్ఛందంగా శుభ్రం చేసిన గౌతమ్ గంభీర్



ప్రస్తుతం దేశమంతా రామనామం జపిస్తోంది. అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 22న జరిగే ఈ మహాక్రతువు కోసం అంగరంగ వైభవంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజున దేశంలోని అన్ని ఆలయాలు కూడా సిద్ధం కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ఇందుకోసం దేవాలయాలన్నింటినీ స్వచ్ఛందంగా శుభ్రం చేయాలని సూచించారు. ప్రధాని పిలుపును అందుకున్న ఇప్పటికే చాలామంది తమ తమ ప్రాంతాల్లోని దేవాలయాలను శుభ్రం చేస్తున్నారు. అనంతరం వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను తీసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో భాగం కానున్నారు. ఆలయాలను క్లీనింగ్ చేస్తున్నారు. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్, బీజేపీ ఎంపీ గౌతమ్ గంభీర్ కూడా ఈ జాబితాలో చేరిపోయారు. ఢిల్లీలోని కరోల్ బాగ్‌లోని శివాలయాన్ని సందర్శించిన ఆయన స్వయంగా ఆలయాన్ని క్లీన్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. స్టార్ క్రికెటర్, ఎంపీ అయి ఉండి కూడా గంభీర్ తన సింప్లిసిటీని చాటుకున్నారంటూ అభిమానులు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక బాలీవుడ్ సీనియర్ హీరో జాకీష్రాఫ్ కూడా రామాలయాన్ని శుభ్రం చేశారు. స్వయంగా గుడి మెట్లను క్లీన్ చేస్తూ కనిపించారు. అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా దేవాలయాలను శుభ్రం చేసిన తర్వాత ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని ప్రధాని మోడీ పిలుపు ఇచ్చారు. సెలబ్రిటీలు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.

## జర్మనీలో చికిత్స పొందుతున్న సూర్యకుమార్



టీమిండియా స్టార్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్‌కు శస్త్రచికిత్స జరిగింది. కొన్ని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అతను ప్రస్తుతం జర్మనీలో చికిత్స పొందుతున్నాడు. తాజాగా మేజర్ సర్జరీ పూర్తి చేసుకున్న సూర్య.. తాను కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపాడు. ఆస్పత్రి బెడ్‌పై ఉన్న తన ఫొటోను షేర్ చేసిన మిస్టర్ 360 ప్లేయర్.. 'శస్త్రచికిత్స జరిగింది. నా ఆరోగ్యం గురించి ఆరా తీసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. త్వరలో పునరాగమనం చేస్తా' అని రాసుకొచ్చాడు. PTI ప్రకారం, సూర్యకుమార్ పూర్తి ఫిట్‌నెస్ తిరిగి పొందడానికి కనీసం ఒక నెల సమయం పడుతుంది. తద్వారా ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్-17 నాటికి పునరాగమనం చేసే అవకాశం ఉంది. అలాగని ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు సూర్య దూరమయ్యే అవకాశాలను కూడా కొట్టిపారేయలేం. ఎందుకంటే రాబోయే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి మైదానంలోకి రావాలని సూర్యకుమార్ యాదవ్‌కు బీసీసీఐ సూచించింది. అందుకే ఐపీఎల్‌లో తొలి కొన్ని మ్యాచ్‌ల నుంచి అతడు దూరం కానున్నట్లు సమాచారం. దీని ప్రకారం టీ20 ప్రపంచకప్‌కు ముందు సూర్యకుమార్ యాదవ్ రంగంలోకి దిగడం ఖాయం. అమెరికా, వెస్టిండీస్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో కూడా పాల్గొంటానని టీమిండియా ఆటగాడు ధీమాగా చెబుతున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాకు సూర్యకుమార్ యాదవ్ అనివార్యం. ఎందుకంటే గత రెండేళ్లలో పొట్టి క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్నాడీ మిస్టర్ 360 ప్లేయర్. సూర్య 57 ఇన్నింగ్స్‌ల్లో 4 సెంచరీలు, 17 అర్ధసెంచరీలు సాధించాడు. 171.55 స్ట్రైక్ రేట్‌తో 2141 పరుగులు చేశాడు. తద్వారా మిడిలార్డర్‌లో తన బలాన్ని పెంచుకునేందుకు సూర్యకుమార్ యాదవ్ పునరాగమనం టీమిండియాకు అనివార్యం. 2024 టీ20 ప్రపంచకప్ జూన్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్ జూన్ 29న బార్బడోస్‌లో జరగనుంది.

## మూడో రౌండ్‌కు అర్హత సాధించిన అల్కరాజ్




స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. బుధవారం మెల్‌బోర్న్ లోని రాడ్ లీవర్ ఎరీనా వేదికగా ముగిసిన పురుషుల రెండో రౌండ్ పోరులో అల్కరాజ్.. 6-4, 6-7 (3-7), 6-3, 7-6 (7-3) తేడాతో లొరెంజొ సొనెగొ (ఇటలీ)ను ఓడించాడు. తద్వారా అతడు మూడో రౌండ్‌కు అర్హత సాధించాడు. ఈ విజయం ద్వారా అల్కరాజ్ మరో అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. గ్రాండ్ స్లామ్ టోర్నీలలో అల్కరాజ్‌కు ఇది 15వ విజయం. ఓపెన్ ఎరాలో భాగంగా పురుషుల టెన్నిస్‌లో 21 ఏండ్లకే గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో వరుసగా 15 మ్యాచ్‌లు గెలిచిన ఆటగాళ్లలో (21 ఏండ్ల లోపు) అండీ రూబెక్, నొవాక్ జొకోవిచ్, లిటన్ హెవిట్‌లను అధిగమించాడు. ప్రస్తుతం అల్కరాజ్ వయసు 20 ఏండ్లు మాత్రమే. తొలి రౌండ్‌లో కష్టపడి నెగ్గిన అల్కరాజ్‌కు రెండో రౌండ్‌లోనూ పోరాడాల్సి వచ్చింది. తొలి సెట్‌లో గెలిచిన ఈజీగానే నెగ్గిన అతడు.. తర్వాత సెట్‌లో ఓడాడు. కానీ తర్వాత పుంజుకుని సొనెగొను మట్టికరిపించాడు.రెండో రౌండ్ సింగిల్స్ మ్యాచ్‌లలో భారత ఆటగాడు సుమిత్ నాగల్.. 6-2, 3-6, 5-7, 4-6 తేడాతో షాంగ్ (చైనా) చేతిలో ఓడాడు. టాప్ సీడ్ కాస్పర్ రూడ్.. 6-3, 6-7 (5-7), 6-3, 3-6, 7-6 (10-7) మూడో రౌండ్‌కు అర్హత సాధించాడు.



## షోయబ్‌తో డివోర్స్‌పై సానియా కీలక వ్యాఖ్యలు

భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్ విడిపోయారని, త్వరలో విడాకులు కూడా తీసుకుంటారని గత కొన్ని నెలలుగా వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే వారు వేర్వేరుగా జీవిస్తున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ రూమర్లకు బలం చేకురుస్తూ సానియా తన ముద్దుల కుమారుడు ఇజాన్‌తో కలిసి దుబాయ్‌లోనే ఉంటోంది. అదే సమయంలో షోయబ్ ఎక్కువగా పాకిస్తాన్‌లోనే కనిపిస్తున్నాడు. ఆ మధ్యన కుమారుడి పుట్టిన రోజు వేడుకలకు సానియా, షోయబ్ ఇద్దరూ హాజరయ్యారు. అయితే ఎడమొహం, పెడమొహంగానే కనిపించారు. దీంతో వీరిద్దరూ నిజంగానే విడిపోతున్నారా? అంటూ అనుమానాలు, సందేహాలు తలెత్తాయి. మరోవైపు తమ విడాకుల వార్తలపై ఇటు సానియా మీర్జా గానీ, అటు పోయబ్ మాలిక్ గానీ ఇంతవరకు స్పందించిన దాఖలాలు లేవు. అయితే వీరిద్దరూ అప్పుడప్పుడు చేసుకుంటున్న పోస్టులతో భార్యాభార్తల మధ్య దూరం పెరిగిందని తెలుస్తోంది. తాజాగా సానియా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పెళ్లి, విడాకుల గురించి ఒక ఆసక్తికర పోస్టును షేర్ చేసింది. దీంతో వీరద్దరి విడాకుల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఇంతకీ సానియా ఏం రాసుకొచ్చిందంటే? 'పెళ్లి కష్టం.. విడాకులు ఇంకా కష్టమే.. మీరు కఠినంగా ఉంది ఎంచుకోండి. లావు (ఒబెసిటీ)గా ఉండటం కష్టం.. ఫిట్‌గా ఉండటమూ కష్టమే.. మీరు కఠినంగా ఉంది ఎంచుకోండి. అప్పు ఉండటం కష్టం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడమూ కష్టమే.. మీరు కఠినంగా ఉంది ఎంచుకోండి. ఇతరులతో కలిసిమెలిసి మాట్లాడటం కష్టం.. ఏ సమాచారమూ లేకుండా ఉండడమూ కష్టమే.. మీరు కఠినంగా ఉంది ఎంచుకోండి. జీవితం అనేది అంత సులభమేమీ కాదు అది ఎప్పటికీ కష్టమే. కానీ ఎప్పుడూ మన కష్టాన్నే మనం ఎంచుకోవాలి%"%' అని ఇన్‌స్టా స్టోరీస్ లో రాసుకొచ్చింది సానియా. ప్రస్తుతం ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తన భర్త షోయబ్ మాలిక్‌ను ఉద్దేశించే సానియా ఈ పోస్ట్ పెట్టిందా? అతనితో విడాకులపై ఇన్ డైరెక్టుగా హింట్ ఇచ్చేసిందా? అని నెట్టింట కామెంట్స్ వినిపిస్తున్నాయి.



ఫోకస్ న్యూస్

శుక్రవారం, 19 జనవరి, 2024





మెగాస్టార్ చిరంజీవిని మరోసారి పద్మ పురస్కారం వరించనుందన్న ప్రచారం సాగుతోంది. పద్మ అవార్డుల్లో అత్యున్నత పురస్కారంతో ఆయన్ను సత్కరించాలని భారత ప్రభుత్వం సిద్ధం అయినట్లు సమాచారం. చిరంజీవిని **2006**లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ప్రజలకు ఆయన చేసిన సేవలకు గాను, సినిమాలతో ప్రేక్షకులను కొన్నేళ్లుగా అలరిస్తున్న అందుకు గాను పద్మ పురస్కారంతో గౌరవించింది. ఇప్పుడు నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిరంజీవికి దేశంలో రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ ఇవ్వనున్నట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే... అధికారికంగా ఎటువంటి సమాచారం లేదు. ప్రతి ఏడాది రిపబ్లిక్ డేకి ముందు రోజు పద్మ పురస్కారాలు ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ప్రకటించబోయే పేర్లలో చిరంజీవి పేరు ఉన్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. కరోనా సమయంలో ప్రపంచమంతా స్తంభించింది. అన్ని రంగాల్లో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందుకు చిత్రసీమ ఏమీ అతీతం కాదు. ఆ కష్ట కాలంలో చిరంజీవి ముందడుగు వేశారు. ఇండస్ట్రీ ప్రముఖులను ఏకం చేసి పెద్దన్న పాత్ర పోషించారు. లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన సినీ కార్మికులకు, విలేకరులకు నిత్యావసర సరుకులు అందించారు. వ్యక్తిగతంగా కొంత మందికి ఆయన సాయం చేశారు. సకాలంలో ఆక్సిజన్ లభించక ఇబ్బందులు పడుతున్న సామాన్యుల కోసం ఆక్సిజన్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులు అంబులెన్స్ సర్వీసులు నడిపారు. ఈ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం చిరంజీవికి పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరిస్తున్నట్లు తెలిసింది. సోషల్ మీడియాలో ప్రచారం మెగా అభిమానులకు అమితానందం కలిగిస్తోంది. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ తరానికి చెందిన హీరోలు రెండు, మూడు వందల సినిమాలు చేశారు. అయితే... ప్రస్తుతం, ఈ తరంలో తెలుగులో అత్యధిక సినిమాలు చేసిన అగ్ర హీరో చిరంజీవి అని చెప్పాలి. హీరోగా **150**కు పైగా సినిమాలు చేశారు.

# చిరుకు పద్మవిభూషణ్ ప్రకటించే ఛాన్స్




## నటి వేదిక కీలక భూమికలో ఫియర్

కథానాయిక వేదిక ప్రధాన పాత్ర పోషిస్తున్న 'ఫియర్' చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభం అయ్యింది. ఈ సినిమాకి హరిత గోగినేని దర్శకత్వం చేస్తుండగా, దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్ ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ కథతో ఉంటుందని దర్శకురాలు హరిత గోగినేని చెపుతున్నారు. ఇందులో అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్స వానికి సీనియర్ నటుడు మురళీ మోహన్, దర్శకుడు కరుణాకరన్ ముఖ్య అతిధులుగా వచ్చి టీముకి తమ అభినందనాలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తేజ కాకుమాను, బిగ్ బాస్ ఫేమ్ సోహైల్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సినిమా షూటింగ్ గురించి ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాను అని కథానాయకురాలు వేదిక చెప్పింది. ఎందుకంటే ఇలాంటి ఒక సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రం చెయ్యడం తనకి ఇదే మొదటిసారి అని చెప్పింది. ఆమె పాత్రలో ఎన్నో వైవిధ్యాలు వుంటాయని, అలాగే తన నటనని కనపరిచే చిత్రం ఇది అవుతుందని చెప్పింది. ఇంతకు ముందు  తెలుగులో 'కాంచన', 'రూలర్' సినిమాల్లో నటించాను, అలాగే ఓ వెబ్ సిరీస్ చేశాను కానీ సస్పెన్స్ థ్రిల్లర్ కథలో నటించలేదు. ఇప్పుడు దర్శకురాలు హరిత గోగినేని ఎడ్జ్ ఆఫ్ సీట్ థ్రిల్లర్ స్క్రిప్ట్ రెడీ చేసి ఈ కథ నాకు చెప్పినప్పుడు నేను బాగా ఇంప్రెస్ అయ్యాను. 'స్టోరీ, క్యారెక్టర్స్ డిజైన్ లో హరిత చాలా క్లారిటీగా ఉన్నారు. కొత్త డైరెక్టర్ అని నాకు అనిపించలేదు. అవార్డ్ విన్నింగ్ ఆర్టిస్టులు, మంచి టెక్నీషియన్స్ తో ఈ 'ఫియర్' సినిమా చేస్తున్నాం. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం', అని చెప్పింది వేదిక.

## విడుదలకు ముందే దేవర ఓటిటి రైట్స్

ఓటీటీ రైట్స్, శాటిలైట్ రైట్స్ కోసం పోటీ మొదలయిపోతోంది. ఇప్పటికీ ఎన్నో సినిమాల విషయంలో అదే జరిగింది. ఇప్పుడు ఆ లిస్ట్‌లోకి 'దేవర' కూడా యాడ్ అయ్యింది. ఎన్‌టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో మూవీ అని తెలియగానే ప్రేక్షకుల్లో విపరీతంగా ఆసక్తి పెరిగిపోయింది. ఇక ఇందులో ఎన్‌టీఆర్ లుక్‌తో పాటు టైటిల్ రివీల్ చేయగానే ఫ్యాన్స్ అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. అప్పటి నుండే ఈ మూవీ ఓటీటీ రైట్స్ కోసం సంస్థలు పోటీపడ్డాయి. 'దేవర' ఓటీటీ రైట్స్‌ను రికార్డ్ ప్రైజ్‌తో నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుందని సమాచారం. కొరటాల శివ, ఎన్‌టీఆర్ కాంబినేషన్‌లో ఇప్పటికే 'జనతా గ్యారేజ్' సినిమా వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్ అయ్యింది. ఒక మంచి మెసేజ్ ఓరియెంటెడ్ కథకు కమర్షియల్ ఎలిమెంట్స్‌ను జోడించి హిట్ కొట్టడం కొరటాల శివ స్టైల్. అలాంటి ఈసారి ఎన్‌టీఆర్‌తో 'దేవర' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ మూవీ ఫస్ట్ లుక్ విడుదలయినప్పటి నుండి కొరటాల ముందు సినిమాల్లో లేని డిఫరెంట్ ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయని ప్రేక్షకులు బలంగా నమ్మడం మొదలుపెట్టారు. పైగా ఇందులో వైలెన్స్ కూడా బాగానే ఉంటుందని దర్శకుడు చెప్పుకొచ్చాడు. దానికి తగినట్టుగానే తాజాగా విడుదలయిన 'దేవర' గ్లింప్స్ కూడా పూర్తి యాక్షన్‌తో ఉంది.

## టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వనున్న జామీ లివర్



బాలీవుడ్ నుంచి స్టార్‌కిడ్స్ టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడం కొత్తేమీ కాదని తెలిసిందే. ఇప్పటికే పలువురు బాలీవుడ్ యాక్టర్ల వారసులు తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఇప్పుడిదే జాబితాలో మరో సెలబ్రిటీ కూతురు చేరిపోయిందన్న వార్త ఫిలింనగర్ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్‌లో తన అదృష్టం పరీక్షించుకునేందుకు పాపులర్ బాలీవుడ్ కమెడియన్ జానీలివర్ కూతురు జామీ లివర్ రెడీ అయింది. జామీ లివర్ తాజా సమాచారం తెలుగులో రాజీవ్ చిలుక తెరకెక్కిస్తున్న ఆ ఒక్కటి అడక్కు సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది జామీ లివర్. ఛోటా భీమ్ క్రియేటివ్ వర్క్స్ టీం ఈ సినిమాకు పనిచేస్తుండటం విశేషం. తన మాతృభాష అయిన తెలుగు సినిమాలో నటించే అవకాశం రావడం మరిచిపోలేని మైల్‌స్టోన్ అని తన ఆనందాన్ని అందరితో పంచుకుంది. ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన జానీలివర్ బాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది లీడింగ్ సెలబ్రిటీగా ఓ వెలుగు వెలుగుతున్నారు. నాలుగు దశాబ్దాలకుపైగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను కొనసాగిస్తూ కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారు. మరి ఆయన నటవారసత్వాన్ని కూతురు జామి కొనసాగిస్తూ.. తండ్రికి తగ్గ తనయగా పేరు తెచ్చుకోవాలని కోరుకుంటూ.. ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జామీ లివర్ హౌస్‌ఫుల్ **4** సహా మరో మూడు హిందీ సినిమాల్లో నటించింది. ఓ వెబ్ సిరిస్, మ్యూజిక్ వీడియో కూడా చేసింది.

## విశ్వక్‌సేన్.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి



మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రాల్లో ఒకటి గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. విశ్వక్ సేన్ **11** గా వస్తోన్న ఈ చిత్రానికి ఛల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నాడు. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి, అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఇటీవలే సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. విశ్వక్ సేన్ ఊరమాస్ అవతార్‌లో చేతిలో పందెం కోడి పట్టుకుని కనిపిస్తున్న కొత్త లుక్ విడుదల చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఈ మూవీ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. షూటింగ్ మొత్తం ఈ నెల చివరి నాటికి పూర్తి కానుంది. షూట్ పూర్తవగానే విశ్వక్‌సేన్ ప్రమోషన్స్‌పై ఫోకస్ పెట్టనున్నాడని ఇన్‌సైడ్ టాక్. ఈ చిత్రంలో విశ్వక్‌సేన్‌ను నెక్ట్స్ లెవల్‌లో చూపించబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్, లుక్స్ చెబుతున్నాయి. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి నుంచి మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ సింగిల్ సుట్టంలా సూసి పోకలా లిరికల్ వీడియో సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార సంస్థ బ్యానర్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.